

రచయిత్రి ఆత్మహత్య

- జలంధర

(గత సంచిక తరువాయి)

రాఘవ మామూలు తెల్లబట్టల్లో అతి సాధారణంగా కనబడుతున్నాడు. కానీ, దాని వెనకాల ఏదో కనబడని కాంతి. ఇంటలెక్చువల్ అంటే ఇతనేనా? అతని చూపుల్లో అల్లరి ఉంది. ఎందుకింత మోకరీ ప్రపంచం అంటే ఇతనికి? అర్ధం కాలేదు. అతన్ని అర్ధం చేసుకుందామని చాలాసార్లు ప్రయత్నించాడు. కానీ ఒక పట్టాన కొరుకుడు పడడతను.

"మాట్లాడరేం?" మళ్ళీ అడిగింది ఆమె.

"తప్పంటారా?" నవ్వుతూ అడిగాడు.

"తప్పు, ఒప్పు సమస్య అక్షరాలకు లేదు. అవి స్వేచ్ఛావిహంగాలు. సర్వేశ్వరుడికి రూపమే ఉంటే అక్షరాలు ఆయన అంతర్ బహిర రూపాలు"

"మరి?"

"చలం జీవితాంతంలో నమ్మిన ఒక గొప్ప తాత్వికదర్శనానికి, భగవాన్‌తో అనుభవాల పరంపరకు అసలు అస్తిత్వం లేనట్లు మీరు ముఖ్యంగా మీరు రాయడమేమిటి అని?"

గదిలో ఒక్క క్షణం నిశ్శబ్దం మృదువుగా మోగింది. ఏ మాత్రం డిసిప్లిన్‌లేని ఈ బ్రహ్మచారి గదిలో ఈమె పాచి గోడమీద వెన్నెల్లా ఉంది అనుకున్నాడు విరించి.

"నాకు తెలిసిన చలం - నా తెలుగు దేశానికి తెలిసిన చలానికి మొదట్లో ఈ గందరగోళం అక్కరలేదు. కానీ, ఆ తరవాత ఆయనలో ఈ అన్వేషణ ఒక మలుపులో ప్రారంభమయింది. ఈ పాంచభౌతిక శరీరం, దాన్లో శాశ్వతాత్మ వగయిరా మెటాఫిజికల్ కబుర్లు చెప్పడానికి చలమే అక్కరలేదు, చాలామంది ఉన్నారు. దేశాన్ని తన అద్భుతమయిన భాషతోనూ, తాత్కాలికమయినప్పటికీ సౌందర్యపూరిత భావనతోనూ కదిలించిన చలం, అన్నేళ్ళు రమణాశ్రమంలో ఉండి. తనుగా ఏం కనిపెట్టాడు? ఏమిటి ఆయనను కదిలించింది? కానీ విశ్వేశ్వరుణ్ణి మ్లేచ్ఛుడొకరకంగా, శంకరులు ఒకరకంగా, సామాన్యుడు ఒకరకంగా చూశారు. విశ్వేశ్వరుడొక్కడే చూసింది, బతికింది చలం కాబట్టి, చలంగా భగవాన్‌ను సమీక్షించి మనకేం మిగల్చలేదే అని నా బాధ. మిగతా అందరిలా మతం మత్తులో, తత్వమసిలో మునిగిపోయి మిగతావారి మాటలతో తన ఆలోచనలు రూపుదిద్దుకున్న ఆయనకన్నా, తెలిసిన అనుభవాలతోనో, ప్రతిరోజుకొక మార్పుతో ఎదుగుతున్న జ్ఞానంతోనో, దేశంలో ఒక వర్గంవారి రక్తంలో వెచ్చని ఆవిరి, గుండెల్లో గాడ్పులు తెచ్చిన 'చలం' కావాలి నాకు" సూటిగా స్పష్టంగా చెపుతున్నాడు రాఘవ.

గదిలో ఏదో నిశ్శబ్దం మళ్ళీ ఆవహించింది. విరించికి తెలిసీ రాఘవ ఇన్ని మాటలు మాట్లాడ్డం ఇదే మొదటిసారి.

"మీరు భగవంతుణ్ణి నమ్మరా?"

పొడుగాటి జడ ముందుకు వేసుకుని, మడిగాళ్ళ మీద కూర్చుని అడుగుతున్న ఆ అమ్మాయిని చూసి "బాబోయ్" అనుకున్నాడు విరించి. అతని దృష్టిలో సాధారణంగా అలా ఉండే ఆడపిల్ల 'మీకు ఏ సినిమా హీరో అంటే ఇష్టం? మీ ఫేవరెట్ క్రికెటర్ ఎవరు?' అని అడగాలి మరి.

"అసలు భగవంతుడు అంటే ఏమిటి? మీరు ఏర్పరచుకున్న ఈ భావాల రమ్యహర్మ్యాలనుంచి కొంచెం బయటపడితే, ఆలోచించే అవకాశం ఉంటుందేమో"

"పోనీ మీరు చెప్పండి"

"ఎక్కడున్నాడని ఈ భగవంతుణ్ణి మీరంతా ఇంత పాపాలభైరవుణ్ణి చేసేస్తున్నారు? అహం బ్రహ్మోస్మి అనేమాట నమ్మదలచుకుంటే అంతా భగవత్స్వరూపులే. మరి ఈ అసహ్యతంతా ఏమిటి? సర్వవ్యాపితత్వం, సనాతనత్వం, కనబడుతూ కూడా కనబడనట్లుండడం వగైరా ఊహలన్నీ భగవంతుడైతే, ప్రస్తుతం విద్యుచ్ఛక్తి భగవంతుడవ్వాలి. ఈ గుణాలన్నీ దానికీ ఉన్నాయిమరి. భగవంతుడి చుట్టూ ఏవో చీల్చలేని పొరలు కప్పి, జనాన్ని భయపెట్టడం కన్న నా దృష్టిలో భగవంతుడు ప్రతి గొప్పకళలోనూ, ఉన్నతాత్ముడైన వ్యక్తిలోనూ, సౌందర్య పూరితమైన భావనలోనూ రూపుకట్టుకుంటాడు. ఐన్ స్టీన్ క్వాంటమ్ థియరీ తరవాత కూడా మనుషులు మా దేముడు, మీ దేముడు అని నరకాల్ని సృష్టించుకుంటున్నారంటే, ఈ మూఢత్వం నించి విడిపోవడం వాళ్ళకిష్టమైనా లేకుండా ఉండాలి లేదా సాహసమైనా లేకుండా ఉండాలి. విశ్వవ్యాప్తమైన దాన్లో తన సజీవతను ప్రతిబింబింపచేసుకుని, తనలో సర్వ ప్రపంచాన్నీ పునర్జీవింపచేసుకునే ప్రతిభావంతమైన థియరీ ఉన్నదని ఎవరికి తెలుసు? అవన్నీ చదవండి. ఆ తరవాత భగవంతుడి గురించి మాట్లాడండి" చిన్న పిల్లలకు హోం వర్క్ ఇచ్చి, పుస్తకం మూసేసే టీచర్‌లా ఆపేశాడు రాఘవ.

"ఇన్ని తెలిసిన మీరు, ఇవన్నీ ఎందుకు చెప్పకూడదు?"

"ఎవరికి? వినేవారు ఎవరు? ఎవరికి కావాలి అసలూ. ఇంత మెటీరియల్ ప్రపంచంలో ఏ అనుబంధం మీరు చెప్పే మనుషులకు సంధీకృతం ఆపుతుందని అడుగుతున్నారీ ప్రశ్న? ఈ నా థియరీ నేను చదివిన చదువు, సర్వం మా ఆఫీసులో చెక్కబల్లలకి అంకితమై, ఎంతవరకు వినోదాన్ని కళాత్మకంగా సృష్టించి పేపర్ సర్క్యులేషన్ పెంచగలమో తెలుసుకుని తద్వారా నా జీతం పెంచుకోడానికి ఉపయోగపడుతోంది. ఎంతవరకూ నా కుటుంబ స్థాయిని ఆర్థికపరంగా సంఘంలో పెంచగలమో అనేదాన్నిబట్టి నా మనుష్యులు నాకు ఖరీదు కడుతున్నారు. ఆలోచింపచేసేది. అదేదైనా చాలా తక్కువ మందికి కావాలి. తమ జీవన సుఖాలను గమ్యంలేని ప్రయాణాలుగా నిర్వీర్యపరిచి ఎదురు నిలబడి యుద్ధం చెయ్యనిది, కాలక్షేపానికి నాలుగు కొటేషన్స్ వాడుకోగలిగినది అయిన సూడో ఇంటలెక్చువాలిటీ ప్రతిఫలించే సాహిత్యంకావాలి కానీ, ఆలోచింపచేసి, తన అస్థిత్వాన్ని మహా భయంకర సంచలిత జ్ఞానసాగరాల్లో ముంచితేల్చే ఏ తత్వం, ఏ శాస్త్రం, కళా, కావ్యమూ ఎవరికీ అక్కర్లేదు. కావాలి అనుకునేవారు ఉంటారేమో కానీ వాళ్ళను వేళ్ళమీద లెక్కవెయ్యవచ్చు. సర్వేశ్వరుడి అస్థిత్వాన్ని గురించి మాట్లాడక, ప్రతి వ్యక్తి సర్వేశ్వరత్వాన్ని పొందే మార్గం చూపెట్టిన బుద్ధుణ్ణి దేముణ్ణి చేసి, ఆయన చెప్పింది కాలగర్భంలో కలిపేసిన తెలివిగలవారు ఈ జనం. సోక్రటీస్ బతికుంటే ఆలోచింపజేస్తాడేమోనని భయపడి బలవంతంగా చంపేసింది ఈ జనం. శంకరుల అన్నపూర్ణాష్టకం చదివి కోరికలు తీరతాయని దీపం పెట్టే ఈ జనం, ఆయన చెప్పిన మిగతావి ఏమి అనుసరిస్తున్నారని? ఆయన మాయావాదాన్ని ఖండించే ఈ తెలిసీ తెలియనివారు జగత్తు మిధ్య భగవంతుడు సత్యం. భగవంతుడే జగత్తు అన్న వాదంలో మూడోమాట మర్చిపోయి భంగపడుతున్నారు. అందుకని, ఈ జనాన్ని తట్టి లేపడంకన్నా జోకొట్టడం సులభం. అది అంతే"

గోడకు చారగిలబడి రెండుకాళ్ళూ చాపి అవాక్కై వింటున్నాడు విరించి. ఏదో సరదాకి, కాలక్షేపానికి, రచయితల్లో మనుష్యుల్ని చూసి నవ్వుకుందామనే దిక్కుమాలిన కోరికతోటి పెట్టిన ఈ మీటింగ్ ఇవ్వాళ చాలా గొప్పమలుపు తిరుగుతోంది. అందులో ఒక వ్యక్తి స్త్రీ అవడం మరీ తమాషాగా ఉంది. కానీ పర్యవాసం?

రాఘవగారూ మనుషులందరూ ఒక లెవెల్లో ఉండరు. సృష్టిలో మానవత్వం అనేది కేవలం మిధ్యావాదం. ఎక్కడుందది? ఔన్నత్యం ఉన్న ఏ వ్యక్తీ తన కిందిమెట్టుమీద ఉన్నవాడిని చూసి నవ్వుకోడు. నవ్వుకుని హేళన చేసేవాడెపుడూ ఉన్నతుడవడు. జాలిపడతాడు. చేయూతనివ్వడానికి ప్రయత్నిస్తాడు. జెక్ ఫిలాసఫీలు, అణువును విచ్ఛేదన చేస్తే ఏర్పడే పరమాణువుల సముదాయం, వాటి మధ్య ఆకర్షణ, వికర్షణల స్వరూపం హిందూ మిథాలజీలో కాస్మిక్ ఎనర్జీకి ప్రతిపాదితమైన నటరాజనృత్యం అని తెలిసీ నటరాజును పూజ చెయ్యఖ్ఖరలేదు. కేవలం ఏదో నమ్మకంతోనో, ఆర్తితోనో ప్రారంభం అయ్యే ప్రతిపనీ తరవాత సత్యాన్వేషణకు దారితీయవచ్చుగా! అటువంటివారికి మీబోటి మేధావి వర్గం చేయూత ఇవ్వచ్చుగా?"

ఖంగుమంటోంది ఉమ కంఠం. ఆమె గొంతులో మృదుత్వం పదును వున్నది.

రెండు చేతులూ కట్టుకుని ఆమెవంకే చూస్తున్నాడు రాఘవ. ఏమిటీమె? ఏం చెబుదామని ప్రయత్నిస్తోంది? అతని ఆలోచనా తరంగాలు ఆమెను తాకినట్లున్నాయి.

"సారీ! మిమ్మల్ని ఇంప్రెస్ చేద్దామని మాట్లాడ్డంలేదు. చాలాసార్లు మీ సమీక్షలు, పుస్తకాలు చదివాను. మీరు చాలా గొప్పగా చదువుకున్నవారు. కానీ ఏదో సినిసిజంతో కొట్టుకుపోతున్నారనిపించింది. ఈ వాదన కూడా కరెక్ట్ కాదేమో నేనే వేటినో కొన్ని సిద్ధాంతాలను హేతువాదాలకు అందని వాటిని నమ్మి ప్రపంచాన్ని తిరగాబోర్లా చూస్తున్నానేమోనని అనుమానమొచ్చింది. కొన్ని వందల పుస్తకాలు చదవడం కన్నా ఒక సజీవమైన వ్యక్తితో, నా సబ్జెక్ట్ అర్ధమైన వ్యక్తితో వాదించి చాలా నేర్చుకోవచ్చనిపించింది. అందుకే, మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చాను."

మాట్లాడలేదు రాఘవ. గాలిలోనించి పక్కింటి అరవమామి పోట్లాట వినిపిస్తోంది. దూరంగా ఎక్కడో రైలుకూత, కారు ఆగిన చప్పుడు. వీటన్నింటి మధ్యా విరామ సంగీతంలా అప్పుడప్పుడూ కోయిల కూస్తోంది.

కానీ, ఇదంతా నేపథ్యమే. విరించికి ఊపిరి అందడంలేదు. మహా సరదాగా ఉన్నది. కాస్త భయంగానూ ఉన్నది. వాతావరణం ఏదో తెలియని కొత్తకాంతితో ఎలక్ట్రిఫై అయిందనిపించింది. తెలియని తెగింపు వచ్చింది.

"ఉమగారూ మీరేం చదువుకున్నారు?"

"ప్రైవేట్‌గా ఎమ్.ఏ చేస్తున్నాను"

"సబ్జెక్ట్"

"లిటరేచర్"

"మీరు రచయిత్రులు కదా వెంటనే తప్పుగా అర్ధం చేసుకోకండి అడిగితే"

"అడగండి."

"మీకు పెళ్ళైందా?"

"ఎందుకిప్పుడా ప్రశ్న?"అని అడగలేదు ఉమ. తలెత్తి సూటిగా అతని కళ్ళల్లోకి చూసింది. ఆ చూపులో ఏముందో తెలియదుకానీ, రాఘవకు వెన్నెముకలో ఏదో తెలియని చల్లదనం.

చేతిలో ఏమన్నా ఉంటే వేసి మొహం పగలకొడుతుందేమోనని పక్కకు తప్పుకోవాలనిపించింది విరించికి.

వెంటనే ఒక్కసారి నవ్వేసి "లేదు సరే వస్తాను. మరొకసారి కలుసుకుందాం. నమస్తే" మెల్లిగా లేచి, కుచ్చెళ్ళు సుతారంగా దులుపుకుని వెళ్ళిపోయింది. గాలిలో తేలే ఆమె అందెల సవ్వడి వింటూ స్థబ్దులై కూచుండిపోయారు ఇద్దరూ.

ఉన్నట్లుండి ఒక్కసారి గట్టిగా నవ్వేశాడు రాఘవ.

"ఎందుకు గురువుగారూ నవ్వుతున్నారు?" అంటూ తనూ నవ్వాడు విరించి.

"మనిద్దరం ఒక మహాప్రమాదం నుంచి తప్పుకోడానికి ప్రయోగించిన చాలా మామూలు ట్రిక్‌ను తలుచుకుని.."

"సార్! ఇంతకీ ఆవిడ ఎవరన్నారు?"

"ఏమో? నాకూ తెలియదు. ఇల్లాగే ఒక మీటింగ్‌లో పరిచయమైంది. ఆవిడ నవల ఒకటి మన పత్రికలో వేశాంలే"

"సార్.. ఆ నవల ఎలా ఉంది?"

"ఏమో చాలా సెంటిమెంటల్ అనుకున్నాను అప్పుడు. మరొకసరి చదవాలి. చాల ఇండిపెండెంట్ టైప్‌లా ఉన్నది. ఎక్కడైనా ఉద్యోగం చేస్తోందేమో? పద అలా బైటకి వెళ్దాం" చాలా మామూలుగా అని బైటకు వెళ్ళారు ఇద్దరు.

కానీ, ఇద్దరూ దారిలో ఏమాత్రం తర్కించనిది, నిమిషం మర్చిపోనిది ఒకటే.. 'ఉమ'

ఇంటికి వెళ్దామని బయలుదేరాడు రాఘవ. అతను ఆఫీసు ముందునుంచే వెళ్ళాలి. వాకిట్లో గూర్ఖా. చీకట్లో రేపు ప్రసవించబోయే సాహిత్యాన్ని, రాజకీయాల్ని కడుపులో దాచుకుని నిద్రపోతున్న ఏదో ఊహకందని రూపంలా ఉన్నది 'ఈ తరం' ఆఫీసు ఒక్క క్షణం తారట్లాడాడు.

"కౌన్?" అరిచాడు గూర్ఖా.

సమాధానం చెప్పి లోపలికి వెళ్ళాడు. లైట్లు లేసి ఏదో ఫైల్ వెతికాడు.

అందులో ఒక కటింగ్ దొరికింది.

ఉమాదేవి.. 22 ఏళ్ళు. వీణ వాయిస్తారు. వగైరా వివరాలున్నాయి. "సాహిత్యంలో స్పందన ఉండాలని నమ్ముతారు" ఈ ఒక్క విషయం తప్ప, ఆ నీరవ నిశీధిలో ఆ జీవంలేని నల్లటి అక్షరాలు మరేం మాట్లాడలేక పోయాయి.

ఆలోచిస్తూ బయటికి అడుగువేశాడతను.

"ప్రతి పరిచయం స్నేహం అవ్వాలని, ప్రతి స్నేహం చాలా గొప్పదవ్వాలని ఎక్కడున్నది సార్? స్నేహం గొప్పదే కాదనను. 'ఇందుకు' అని తెలియని స్నేహం మటుకు చాలా ప్రమాదకరమైంది" అన్నాడు విరించి.

రాఘవ, విరించి రామకృష్ణా లంచ్ హోంలో కాఫీ తాగుతున్నారు చాలా పురాతనమైన ఆ హోటల్‌కు చాలా గొప్ప చరిత్ర ఉన్నది. బైటనించి వచ్చే కదంబవాసనలు, లోపలినించి వచ్చే మసాలా దోశల వాసనలూ కలగాపులగం అయిపోయి వింత మాదకత ఉంటుంది గాలిలో, అక్కడ కాఫీ చాలా ప్రసిద్ధి.

వారిద్దరి సబ్జెక్ట్ 'ఉమ'. ఆ మొదటి పరిచయం తరవాత నాలుగుసార్లు కలిశారు. ప్రతి కలయికలోనూ రాఘవలోని మేధావిని చూసి ఉమ చూపే ఆరాధన చాలా నిష్కల్మషంగా ఉండేది. అన్ని పొరలు విడదీసి అతనికి అలా దగ్గరైనవారు ఎవరూ లేరు. అందుకని అతని దృష్టిలో ఉమ కేవలం అడ్మైరర్‌గా ఆగిపోలేదు.

గొప్ప రచయిత, ఒక గొప్ప పత్రికకు ఎడిటర్ అయిన రాఘువ లోపల ఒక మొగవాడు. జీవితంపట్ల ఉదాసీన భావం ఉన్న వ్యక్తి ఉన్నాడు. అందుకే అతని అలౌకిక తార్కిక జ్ఞానం అతడి జీవితానికి ఉపయోగించలేదేమో? ఉమ ఏదో తెలుసుకోవాలి అని ప్రశ్నించినప్పుడల్లా, అతను ఆమెను వాదనతో నోరు కట్టించేవాడు. అందులో అతనికి ఏదో ఇగో శాట్స్‌ఫాక్షన్.

"దెయ్యాలు ఉన్నాయా అనే శీర్షిక నిర్వహించినంత మాత్రం చేత మా ఆఫీసులో కుర్చీలూ, బెంచీలూ కూడా దెయ్యాలేనని నమ్మాలనే సిద్ధాంతం ఏం లేదు. ఏదో పొట్టకూటికి ఉద్యోగం చేస్తున్నాంకానీ, ఇదంతా ట్రాష్ అనే వాళ్ళు మా మధ్యే ఉన్నారు. మనుషుల్ని కొనగలరేమోకానీ, వాళ్ళ ఆలోచనలను కొనలేరుగా" అన్నాడు రాఘువ ఉమ ఆ సబ్జెక్ట్ ఎత్తినప్పుడు

"నాకు మాత్రం హనుమంతుడి దండకం వచ్చు. నేను విపరీతంగా నమ్ముతాను" నిజాయితీగా ఒప్పుకున్నాడు విరించి. అతను పొలం గట్ల మీద ఉండే మోహినీ పిశాచాల గురించి, కొరివి దెయ్యాల గురించి వినే ఉన్నాడు.

"భయం బేస్‌గా కొన్ని నమ్మకాలు పూజింపబడతాయి. అప్పుడప్పుడు పాపం భగవంతుడు కూడా ఆ కోవలోకి చేర్చబడతాడు. అది కాదు సబ్జెక్ట్. అసలు ఈ విషయం మీద ఇంత డిస్కషన్ నిర్వహించే మీరు నిజాయితీగా ఎందుకు ఆలోచించరు? మీరు నమ్మని విషయాలు, ఆలోచించడానికే వ్యతిరేకించే విషయాలు ఎదుటివాళ్ళ నెత్తిమీద రుద్దుదామని ఎందుకు ప్రయత్నం? సిన్సియారిటీ లేని ఈ పనివల్ల ప్రయోజనం ఏమిటి?"

ఆమె అడుగుతున్న ప్రశ్నకు జవాబు చెప్పదలుచుకోలేదతను. మామూలుగా అయితే 'ఒక థియరీనో, ధర్మాన్నో, న్యాయసూత్రాన్నో కేవలం కొన్ని వాక్యాలుగా మార్చి ప్రచురిస్తే ప్రజలు దాన్ని చాలా మాటరాఫ్ ఫాక్ట్‌గా తీసుకుంటారు. చర్చనీయాంశం చేస్తే ఆలోచించడం ప్రారంభించి ఒకరినుంచి ఒకరు చాలా నేర్చుకుంటారు' అని సమాధానం చెప్పేవాడేమో కానీ కాసేపు ఆమెను ఏడిపిద్దామనిపించింది.

"ఒక నిజం అది నిజమేనని నిర్ధారింపబడినపుడు అది దాని ఔన్నత్యాన్ని కోల్పోతుంది అన్నాడు గదా ఆస్కార్ వైల్స్" అని తప్పించుకున్నాడు.

మాట్లాడకుండా వెళ్ళిపోయింది ఆమె. ఆ తరువాత పదిహేను రోజులు కనబడలేదు.

రాఘువలోని గొప్ప వ్యక్తిత్వం తను అద్దెకుండే 250రూపాయల ఇంట్లోకి వెళ్ళగానే మారిపోతుంది. తప్పదు. తల్లికి మందులు, తెలివిగా ప్రవర్తించాలనుకునే భార్య తీసుకునే అతి జాగ్రత్తలు అలవాటైపోయాయి. కానీ ఎందుకో ఉమ 'హాంటింగ్ మెమరీ' అయిపోయింది. అయినా, ఆడపిల్లకు అంత తెలివి ఏమిటసలు అని విసుక్కున్నాడు.

సెలవులు వచ్చాయని పిల్లల్ని స్నేక్‌పార్క్‌కు తీసుకు వెళితే అక్కడ చూపించిన నాగుపాము ఎండలో మిలమిలా మెరుస్తూ పడగ విప్పడం చూశాడు. ఉమ గుర్తుకు వచ్చింది.

అష్టలక్ష్మి గుడి పై ప్రాకారం మీద నుంచి అస్తమిస్తున్న సూర్యకాంతిలో మెరుస్తున్న అమ్మవారిని చూసినప్పుడు ఉమే గుర్తుకు వచ్చింది.

కలుసుకోవడం తప్పదనిపించింది. కానీ కనీసం ఆమె ఆహ్వానించలేదు. అడ్రస్‌కూడా లేదు. దానికోసం ప్రయత్నిస్తే దొరక్కపోదేమో కానీ అభిమానం అడ్డు వచ్చింది.

"అయినా, ఆడపిల్లకు అంత ఆలోచనా, ఆ గోలా ఏమిటి విరించీ అన్నాడోరోజు ఆపుకోలేక.

(కొనసాగింపు వచ్చేనెలలో)

Post your comments